చవితికి అనుమతులు తప్పనిసరి

మైదుకూరు : వినాయక చవితి విగ్రహాలు, మండపాల ఏర్పాటుకు పోలీస్ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని డీఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వివాదాస్పద స్థలాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. వినాయకుని విగ్రహాలకు భద్రతను నిర్వాహకులే కల్పించుకోవాలని అన్నారు. పండుగ సందర్భంగా వినాయకుని విగ్రహాల వద్ద డీజేలు, డ్యాన్స్ ప్రోగ్రాంలు పెట్టవద్దని సూచించారు. నిమజ్జనం రోజున ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. వినాయకుని విగ్రహాల వద్ద మైక్ పర్మిషన్ తీసుకోవాలని, నిమజ్జనం రోజున విగ్రహాల వెంట చిన్న పిల్లలను తీసుకుని రావద్దని సూచించారు. సీఐ సయ్యద్ హసం, ఎస్ఐ మద్దిలేటి పాల్గొన్నారు.

అట్లూరు : గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం, ఇన్‌చార్జి ఎస్ఐ కె.సి. రాజు హెచ్చరించారు. మండల పరిధిలోని అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని పునరావాస కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

బొమ్మను చేసి... ప్రాణము పోసి

- చవితికి ముస్తాబవుతున్న బొజ్జగణపయ్యలు
- ఉట్టిపడేలా వినాయక విగ్రహాలు
- ఆకట్టుకుంటున్న ప్రతిమలు
- ఊపందుకున్న కొనుగోళ్లు



ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ రూపాల్లో విఘ్నేశ్వర విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. వినాయక చవితి పండుగకు రెండు రోజుల సమయం ఉండటంతో కళాకారులు వినాయక ప్రతిమలను తయారీలో తలమునకలై ఉన్నారు. పట్టణంలో కుమ్మరికొట్టాల, మైదుకూరురోడ్డు, సినీహబ్, ఈశ్వరరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో లంబోదరుని విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఒక అడుగు మొదలుకుని 15 అడుగులకుపైగా విగ్రహాలను వివిధ రూపాల్లో తయారు చేస్తున్నారు. పట్టణంలో 13 వినాయక విగ్రహాలును విక్రయించే కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో దాదాపు 2,800పైగా విగ్రహాలను విక్రయించనున్నారు. కొందరు ఉత్సవ కమిటీల వారు హైదరాబాదు, నెల్లూరు ప్రాంతాల నుంచి విగ్రహాలను దిగుమతి చేసుకుంటున్నారు. కొందరు పట్టణంలోనే తమకు నచ్చిన రూపంలో విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు. వెయ్యి రూపాయల నుంచి లక్ష రూపాయల పైగా వివిధ రూపాల్లో ఏకదంతుని విగ్రహాలు తయారు చేస్తున్నారు.

వేరే ప్రాంత కళాకారులతో తయారీ

వినాయక చవితికి 5 నెలల ముందు నుంచి విగ్రహాలను తయారు చేయడం మొదలుపెట్టారు. హైదరాబాదు దూల్‌పేట, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కళాకారులు వచ్చి విగ్రహాలను అచ్చుపోసి వెళుతుంటారు. మరికొన్ని చోట్ల ఇతర ప్రాంతాలకు చెందిన కళాకారులు పట్టణంలోనే ఉండి విగ్రహాలను తయారు చేస్తున్నారు. వినాయక విగ్రహాలను పట్టణానికి చెందిన, ఇతర ప్రాంతాలకు చెందిన కళాకారులు శ్రమించి జీవకళ ఉట్టిపడేలా గణనాథుని విగ్రహాలను రూపొందిస్తున్నారు. విగ్రహాన్ని పూర్తిగా సిద్ధం చేయడం, రంగులు వేయడం, మెరుగులు దిద్దడం వంటి పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

ఇతర ప్రాంతాల నుంచి ముడిసరుకులు

వినాయక విగ్రహాల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను రాజస్థాన్ నుంచి, కొబ్బరిపీచును పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలనుంచి, రంగులను హైదరాబాదు, కట్టెలను కడప, ఆదోని ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. విగ్రహాలను ఏర్పాటు చేసే షెడ్డుకు బాడుగ, నిర్మాణానికి లక్షరూపాయల నుంచి రూ.1.5 లక్షల వరకు ఖర్చు అవుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

వివిధ రూపాల్లో..

వినాయక విగ్రహాలను వివిధరూపాల్లో తయారు చేయడంలో ప్రొద్దుటూరు కళాకారుల ప్రసిద్ధి. విష్ణు గణపతి, రాధాకృష్ణగణపతి, బ్రహ్మ విష్ణుమహేశ్వర గణపతి, సింహవాహన, గజవాహన, ఎలుక వాహన, వెంకటేశ్వర, శివపార్వతుల గణపతి తదితర రూపాల్లో విగ్రహాలను తయారు చేయడంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తెప్పిస్తారు. దీంతో కడప, మైదుకూరు, రాజంపేట, చాగలమర్రి, జమ్మలమడుగు, వేంపల్లె తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. ముంబై తరహా గణేష్ విగ్రహాలను రూపొందించడంతో పట్టణం నుంచి విజయవాడ, చెన్నై ప్రాంతాలకు కూడా వినాయక విగ్రహాలు తరలి వెళుతున్నాయి.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

అనంతపురం జిల్లా వాసి మృతి కేసులో కొనసాగుతున్న విచారణ



కంబగిరి రాముడు (ఫైల్)



రోధిస్తున్న కంబగిరి రాముడు భార్య, కుమార్తె

ప్రొద్దుటూరు క్రైం : పేకాట ఆడేందుకు వెళ్లి అనుమానాస్పదంగా మృతి చెందిన కంబగిరి రాముడు కేసులో పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు గ్రామ శివారులో అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి చెందిన కంబగిరి రాముడు పేకాట ఆడేందుకు వచ్చి మంగళవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. పేకాట రాయుళ్లు దొరికితే కేసును ఛేదించవచ్చని భావించిన పోలీసులు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.

పోలీసుల అదుపులో నిర్వాహకుడు, జూదగాళ్లు

కల్లూరు, రేగుళ్లపల్లెతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 10 మంది పేకాటరాయుళ్లను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో రేగుళ్లపల్లెకు చెందిన పేకాట నిర్వాహకుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఉన్నాడు. అతని ఆధ్వర్యంలోనే కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. మంగళవారం సుమారు 25 మంది వరకు పేకాట ఆడేందుకు అక్కడికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కంబగిరి రాముడు పేకాట ఆడేందుకు ఇక్కడికి వచ్చి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.

నా భర్తను చంపేశారు

తన భర్తను కొంత మంది చంపేశారని కంబగిరి రాముడు భార్య లక్ష్మీదేవి అనుమానం వ్యక్తం చేస్తోంది. తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంది. ఆమె ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కంబగిరి రాముడుకు భార్యతో పాటు కల్యాణ్, మీనాక్షి అనే కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు

బద్వేలు అర్బన్ : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తిరుపతి ఎన్‌సీసీ-11 (ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్లు ఉపేంద్రరెడ్డి, హేమ్‌రాజ్‌సాహు పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ విభాగానికి విద్యార్థులను ఎంపిక చేశారు.

ఇందులో భాగంగా ఫిజికల్, మెడికల్ పరీక్షల ఆధారంగా 33 మంది విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవతో పాటు దేశ సేవ చేయాలనుకునే వారికి ఎన్‌సీసీ విభాగం దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాచపూడి వెంకటసాయికృష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ 11 (ఎ) బెటాలియన్ అధికారి రఘువీర్, కళాశాల ఎన్‌సీసీ ఏఎన్ఓ లెఫ్టినెంట్ బాలఓబులేసు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



ఎస్.సత్యబాబు వి.దామోదర్ రాజు అబ్దుల్ కరీం ఎస్.పర్వీన్ బాను

చాపాడు: గురుపూజోత్సవ దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వం ఎంపిక చేసే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా చాపాడు మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు అబ్దుల్ కరీం, అనంతపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఎస్.అరుణ, అల్లాడుపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఎస్.పర్వీన్‌బాను, చాపాడు కస్తూర్బా స్కూల్ ఎస్ఆర్‌టీ ఎన్.భారతి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరందరూ గురువారం కడప లోని కలెక్టరేట్‌లో జరిగే గురుపూజోత్సవ కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందుకోనున్నారు. మండలంలో నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం హర్షనీయమని ఎంఈఓ రవిశంకర్, ఎంఈఓ-2 వంశీకృష్ణ అన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు మండలానికి నాలుగురు ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఎస్‌పీసీఎస్ రామేశ్వరం మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యబాబు అదే పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వి.దామోదర్‌రాజు, ఈశ్వరరెడ్డి నగర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పి.వినోద్‌బాబు, దొరసానిపల్లె జెడ్పీహైస్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయడు ఆర్.గోవర్ధన్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. గురువారం కడపలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ఎల్.శివశంకర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోనున్నారు.

పంచాయతీ కార్యదర్శికి మెమో

బ్రహ్మంగారిమఠం: విధుల పట్ల బాధ్యతారాహిత్యంపై వివరణ కోరుతూ పంచాయతీరాజ్ యాక్ట్‌ను అనుసరించి మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌కు మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. మేజర్ గ్రామ పంచాయతీ సోమిరెడ్డిపల్లె (బి.మఠం)లో 10 వేల మంది ఓటర్లు ఉన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ పంచాయతీని మూడు పంచాయతీలుగా విభజించారు. ఈ పంచాయతీలకు కార్యదర్శిగా ప్రభాకర్ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే గ్రామ పంచాయతీ తీర్మానం చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయకపోవడంతో ప్రభాకర్‌కు మెమో ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. పంచాయతీలో వీధిలైట్లు, డ్రైనేజీ, శానిటేషన్, కంపచెట్లు తొలగింపు పనులను సకాలం పూర్తి చేయలేదని పేర్కొన్నారు. పనులు పూర్తి చేయలేని పక్షంలో ఎంపీడీఓ కార్యాలయంలో రిపోర్టు చేయాలని చెప్పారు. గ్రామ పంచాయతీల్లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను తప్పకుండా ప్రతి కార్యదర్శి పాటించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు మెమోలు అందుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

బి. మఠంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు



ఖాళీ స్థలంలో వెలసిన దుకాణం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో దేవాదాయశాఖ అనుమతి లేకుండా వ్యాపారస్తులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటీవల మఠం దక్షణ ద్వారం తూర్పు భాగంలో సత్రాలను తొలగించారు. అయితే ప్రాకారం పూర్తి కాగానే స్థానిక వ్యాపారులు వారికి ఇష్టం వచ్చినట్లు గదులను నిర్మించుకుంటున్నారు. మఠం పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ అనుమతులు ఇచ్చారా లేక వ్యాపారస్తులే నిర్మించుకుంటున్నారా అనే సందేహాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

బ్రహ్మంగారిమఠం : మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ మూలమని, ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు కృషిచేయాలని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా బుధవారం ఎంపీడీఓ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల బాగుకు మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరంక్షించాలని కోరారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

మైదుకూరు : మైదుకూరు మండలంలో యూరియా కొతర లేదని మండల వ్యవసాయ అధికారి పి.లక్ష్మీప్రసన్న బుధవారం తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, వైట్ పొటాష్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మండలంలోని అన్నలూరు, శివపురం, నంద్యాలంపేట, ఆదిరెడ్డిపల్లె, వనిపెంట, గంజికుంట రైతు సేవా కేంద్రాల్లో ఉన్న ఎరువులను రైతులు తీసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా మండలంలోని రైతులందరూ పంట నమోదును ఖరీఫ్ సీజన్‌లో త్వరగా చేసుకోవాల్సిందిగా సూచించారు. రైతులందరూ పంట నమోదుకు గ్రామాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులతో కలసి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ ఇచ్చి పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. సెప్టెంబర్ 15లోగా కేవైసీ పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రొద్దుటూరు : పౌష్టికారం తీసుకోవడం వలనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి తెలిపారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఆర్అండ్‌బీ బంగ్లా అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కళావతి, ఈశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎల్లమ్మ, గౌహర్ బేగం, రామసుబ్బమ్మ, రమాదేవి, వరలక్ష్మి, రాజ్యలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

■ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు దేవాంగపేట సెక్టార్ పరిధిలోని శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ జి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను ఆమె వివరించారు. మూడేళ్ల లోపు పిల్లలకు పాలు, బాలామృతం, గుడ్లు తినిపించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, పుష్పజ, మాధవి, రాజేశ్వరి, వెంకటసుబ్బమ్మ, రాజమ్మ, పద్మావతి, ఆశావర్కర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

చాపాడు : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్నమ్మ అన్నారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె, చాపాడు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలువలు ఉన్న పప్పు దినుసులు, ఆకుకూరలు, కూరగాయలు క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌పల్లె సర్పంచ్ షమీమ్ భాను, న్యాయవాదులు పర్వీన్, సునీత అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అటానమస్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



అటానమస్ పరీక్షల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని శ్రీ సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బీటెక్ ప్రథమ సంవత్సరం రెండవ సెమిస్టర్ అటానమస్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపరచారు. సివిల్ విద్యార్థులు వెంకట కల్యాణకుమార్‌రెడ్డి 7.7, శ్రావణి 7.6, అర్జున్ 7.4, ఈసీఈ విద్యార్థులు దివాకర్ 9.5, శిరీషా, ఫర్హానా, 9.3, దీపిక 9.2, సీఎస్ఈ విద్యార్థులు కీర్తి 9.1, సుమలత 8.9, శారద, సుమనందిని 8.8, సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్)లో లహరీ 9.1, నాగేశ్వరి 8.3, మహ్మద్ ఫరూఖ్ 8.1, శాతం మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి, వైస్‌ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

గుంతలను పూడ్పించిన ఎస్ఐ



గుంతలను పూడ్పిస్తున్న ఎస్ఐ

కలసపాడు : స్థానిక గిద్దలూరు రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రహదారి అధ్వాన్నంగా ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. రోడ్డు దుస్థితిని చూసిన ఎస్ఐ చిరంజీవి చొరవ తీసుకుని బుధవారం జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో మట్టిని తోలి గుంతలను పూడ్పించారు. దీంతో స్థానికులు, వాహనదారులు ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ప్రొద్దుటూరు : విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్ తెలిపారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. పట్టణ కమిటీ నూతన అధ్యక్షుడుగా సునీల్, కార్యదర్శిగా శ్రావణ్, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్, గణేష్, సహాయ కార్యదర్శులుగా యోగేష్, అభినయ్, కమిటీ సభ్యులుగా ఐదు మందిని ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు. విద్యారంగ హక్కులను, చట్టాలను పరిరక్షించేందుకు ఉద్యమాలను బలోపేతం చేయాలని రాహుల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు సురేష్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

దండపాణి కుమార్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్ ప్రారంభం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఎస్ఎస్ మాల్‌లో ఉన్న రూం నంబర్ 55, 56లో కిడ్స్ వేర్, గర్ల్స్ వేర్, బాయ్స్‌వేర్, ఉమెన్స్‌వేర్ షోరూం కలిగిన దండపాణి కుమార్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్‌ను బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవ ఆఫర్ సందర్భంగా ప్రారంభోత్సవం నుంచి దసరా లోపు బట్టలు కొనుగోలు చేసిన వారికి క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతికి బట్టలు ఉచితంగా అందిస్తామని దండపాణి సంస్థల అధినేత కామరాజు శ్రీనివాసకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎస్ముక్తియార్, ఇవి సుధాకర్‌రెడ్డి, బొగ్గుల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.















